క్లుప్తంగా

నేడు నిడమానూరులో గడప గడపకు మన ప్రభుత్వం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులో శనివారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే వంశీమోహన్ గడప గడపకు పర్యటించి ప్రభుత్వ పథకాలు వివరిస్తారని పేర్కొన్నారు. సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ



గన్నవరం: ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వరరావు సూచించారు. ఆర్టీసీ డిపోలో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని డ్రైవర్లకు, గ్యారేజ్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ముఖ్యంగా బస్సు నడిపే ముందు వాహనం కండీషన్‌ను డ్రైవర్లు పరిశీలించాలని సూచించారు. అతి తక్కువ ప్రమాదాల రేటు కలిగిన ఈ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లను అభినందించారు. ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ స్టేజిల వద్ద బస్సులను రోడ్డు పక్కకు తీసి ఆపాలని తెలిపారు. డిపో మేనేజర్ పి. శివాజీ అధ్యక్షతన విశ్రాంత విమానాశ్రయ ఉద్యోగి ముక్కామల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఉంగుటూరు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు ఆదేశించారు. మానికొండ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల పురోగతిపై లబ్ధిదారులతో ఎంపీడీవో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేస్తున్న వసతులను వివరించి ప్రజల్లో చైతన్య పరిచారు. సమీక్ష అనంతరం 75 మంది లబ్ధిదారులు వచ్చే నెల 15లోగా బేస్‌మెంట్ పూర్తి చేస్తామని చెప్పారు. సర్పంచ్ నిమ్మకూరి స్వర్ణలత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సురేష్, ఈవోఆర్డీ బాషా, కార్యదర్శి రత్నకిషోర్ పాల్గొన్నారు.

బాలోత్సవాన్ని జయప్రదం చేయాలి

గన్నవరం: ఈ నెల 31వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పిల్లల పండుగ (బాలోత్సవం)ను జయప్రదం చేయాలని నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బాలోత్సవంలో భాగంగా విద్యార్థులకు అకడమిక్, సాంస్కృతిక విభాగాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, మున్సిపల్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

పేద కుటుంబాలకు సాయం



కంకిపాడు: సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని చలసాని నాగమణి ఫౌండేషన్ అండ్ అమ్మాజీ చారిటబుల్ ట్రస్టు అధినేత చలసాని అరుణ్‌ప్రసాద్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆటో కార్మికుడు చలివేంద్రపాలెం గ్రామస్తుడు ఖమ్మం సాంబయ్యకు వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 10 వేలు, నెప్పల్లి గ్రామానికి చెందిన పేద కుటుంబాలైన తాళ్లూరి భాస్కర్‌రావు, కోసూరు శ్రీనివాసరావు, చావలి అశోక్‌కుమార్ పిల్లల చదువులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఫౌండేషన్ అధినేత చలసాని అరుణ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఫౌండేషన్ విద్యాభివృద్ధికి తోడ్పాటు నందిస్తుందన్నారు. ట్రస్టు ప్రతినిధులు దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కె.గోవిందరావు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం తిప్పనగుంటలో జల్ జీవన్ పథకంలో భాగంగా రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన మంచినీటి పైపులైను పనులను శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ కలపాల భీమయ్య, పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ పైపులైన్ పనులు ప్రారంభించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మంచినీటి పైపులైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసేందుకు ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్



పీ. నైనవరంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందించడంతో పాటు సమస్యలను సత్వరం పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం పీ. నైనవరంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత రహదారి, డ్రెయిన్ల అభివృద్ధికై శంకుస్థాపన చేశారు. గ్రామంలో నిర్వహించాల్సిన పలు అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్య, వైద్యం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురుకు వంశీ తన సొంత నిధుల నుంచి ఆర్థిక సహాయాలు అందజేశారు. అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికి పర్యటిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పలువురు పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు విషయమై వంశీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజల్ని మభ్యపెట్టేందుకు ప్రతి పక్షాలు అనేక కుట్రలు పన్నుతున్నారని వీటిని ప్రజలే తిప్పి కొడుతున్నారన్నారు. పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా జగన్ పాలన అందిస్తున్నారని చెప్పారు. పేదలు, మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అనేక అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్న ఒకే ఒక్క ప్రజా నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ప్రతి ఇంట్లో ఎన్ని సంక్షేమ పథకాలు అందాయన్నది లబ్ధిదారులే వచ్చి సంతోషంగా చెప్పడం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చూస్తున్నానన్నారు. గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, ఎంపీడీవో భార్గవి, ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ శివరామకృష్ణ, జెడ్పీటీసీ సువర్ణరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ దావు వెంకటేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ దావు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ మండల కన్వీనర్ హుస్సేన్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

110 మందికి కంటి పరీక్షలు



దావులూరు సచివాలయంలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్

కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంతో అవ్వాతాతల కంటికి భద్రత చేకూరుతుందని దావులూరు సర్పంచ్ కొప్పుల లక్ష్మి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో దావులూరు సచివాలయం ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ లక్ష్మి ప్రారంభించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్ కుమార్ 110 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో ఈఓ సిహెచ్ శేఖర్, స్థానికులు కొప్పుల సీతారామయ్య, మసిముక్కు సాంబశివరావు, వైద్య సిబ్బంది జ్యోతిరాణి, జ్యోతిర్మయి, శారద, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మార్కెట్‌కు 30 లక్షల టన్నుల గోధుమలు, బియ్యం



మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ ఏపీ రీజియన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ జోషీ

పటమట(విజయవాడతూర్పు): ఆహార ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ ధోరణి నియంత్రణకు భారత ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌కు 30లక్షల మెట్రిక్‌టన్నుల గోధుమలు, బియ్యాన్ని కేటాయించిందని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ఏపీ రీజియన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ జోషీ పేర్కొన్నారు. ఆయన పటమట కృష్ణానగర్‌లోని కార్యాలయంలో రాష్ట్ర పిండిమిల్లుల సంఘం, ఇతర ప్రైవేటు వ్యాపారస్తులు, బల్క్ కొనుగోలుదారులు, గోధుమ ఉత్పత్తుల తయారీదారులు, సహకార సంఘాలు, స్టాక్ హోల్డర్స్‌తో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమాఖ్యలు, బహిరంగ మార్కెట్ పథకం(దేశీయ) ద్వారా గోధుమలు, బియ్యం టెండర్ ద్వారా అమ్మకానికి సంబంధించిన ధరపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆహార ధాన్యాల సరఫరా కోసం ఎఫ్‌సీఐ విశాఖపట్నం, పోర్టుబ్లెయరు నుంచి మాత్రమే ఈవేలం ద్వారా గోధుమలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర రోలర్ ఫ్లోర్‌మిల్లుల అభ్యర్థన మేరకు ఈ ఏడాది నుంచి రాజమండ్రి, విశాఖపట్నం, హనుమాన్ జంక్షన్‌లో కూడా రేక్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

నేడు టీటీడీ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు



పోస్టర్ ఆవిష్కరణలో సీవీకే ప్రసాద్, కోటేశ్వరరావు, శేషప్రసాద్ శర్మ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని మహితా పబ్లిక్ స్కూల్ కృష్ణలంక, ప్రియదర్శిని స్కూల్ పంజాసెంటర్, సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటనరీ స్కూల్‌లో రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగామ్ కన్వీనర్ సీవీకే ప్రసాద్ తెలిపారు. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఉదయం తొమ్మిది గంటలకు సూర్యారాధన, సూర్యనమస్కారాలు, సామూహిక ఆదిత్యహృదయం పారాయణ నిర్వహిస్తునట్లు తెలిపారు. భక్తులకు కార్యక్రమంలో ఉచితంగా పాల్గొనవచ్చని తెలిపారు. వేడుకల పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ధర్మప్రచారమండలి సభ్యుడు బీవీ కోటేశ్వరరావు, విశ్వధర్మ పరిషత్ సభ్యులు ఉప్పలూరు శేషప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత సమయాన్ని వృథా చేసుకోకుండా పక్కా ప్రణాళికలను రూపొందించుకుని పాటిస్తూ సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్ తేజోవతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో శుక్రవారం వ్యక్తిత్వ వికాసం-కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా కార్యక్రమం జరిగింది. తేజోవతి మాట్లాడుతూ యువత సెల్‌ఫోన్‌కు భానిసలు కాకుండా అవసరం మేరకే ఉపయోగించాలన్నారు. అదే విధంగా జీవితంలో ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించడానికి ఏమి చేయాలనే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మరో వక్తగా హాజరైన సైకాలజిస్ట్ జగదీష్ మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణను అలవరచుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించడం చాలా సులభం అవుతుందన్నారు. యువజన సర్వీసుల శాఖ ఉమ్మడి కృష్ణా జిల్లా అసిస్టెంట్ మేనేజర్ నిమ్మగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం తమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని అన్ని కళాశాలల్లో వ్యక్తిత్వ వికాసం-కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ముగిసిన సంప్రదాయ నృత్యపోటీలు



కూచిపూడి నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: శ్రీనృత్య కళానిలయం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కూచిపూడి, జానపద నృత్యపోటీలు శుక్రవారం ముగిశాయి. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన నృత్య కళాకారులు జూనియర్ సోలో విభాగంలో 75 మంది పోటీ పడ్డారు. త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్ కృతులతోపాటు, పద కవితా పితామహుడు అన్నమయ్య, రామభక్తి సామ్రాజ్యాన్ని చాటిన రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. నాట్యాచారిణి శైలశ్రీ మాట్లాడుతూ సంప్రదాయ నృత్యాల పట్ల నేటి బాల బాలికలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. ఈ ఏడాది సబ్ జూనియర్, జూనియర్ విభాగాలలో మాత్రమే పోటీలను నిర్వహించామన్నారు.

నిరాశ్రయ గృహ నిర్వాహకులకు ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాక సంస్థ పరిధిలోని సితార సెంటర్ సొరంగం వద్ద ఉన్న వీఎంసీ ఆధ్వర్యంలో ఉన్న నిరాశ్రయ వసతి గృహ నిర్వాహణకు అర్హులైన నిర్వాహకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వీఎంసీ పట్టణ సాధికారత విభాగం ప్రాజెక్ట్ డైరెక్టర్ శకుంతల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు రిజిస్టరైన ఎన్జీఓలు, సీఎస్ఓలు, నిరాశ్రయుల సమష్టి సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, స్వయం సహాయక సమాఖ్యలు, ఉమెన్ అండ్ యూత్ కమ్యూనిటీ గ్రూపులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, పబ్లిక్/ప్రైవేట్ సెక్టార్ కంపెనీలు, అసోసియేషన్లు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వసతి గృహాన్ని నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన ఆయా సంస్థలు ఫిబ్రవరి 6వతేదీ సాయంత్రం ఐదు గంటలలోగా వీఎంసీ యూసీడీ విభాగంలో తమ దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు.

విద్యార్థినికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు తులసీనగర్‌కు చెందిన చిన్నారి హర్షిత కానూరులో ప్రైవేటు స్కూల్‌లో ఏడో తరగతి చదువుతుంది.ఆమె గురువారం స్కూల్‌కు వెళ్లి తిరిగి సైకిల్‌పై ఇంటికి బయలుదేరింది. అయితే పంటకాలువ రోడ్డులో ఎదురుగా వచ్చిన ఆటో ఆమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో చిన్నారికి గాయాలయ్యాయి. పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకై చేర్చారు. ఈ ఘటనపై తల్లి శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

పెనమలూరు: యనమలకుదురులో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు కృష్ణానది శివలింగాల ఘాట్ వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6500 సొమ్ము, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్టు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా యడ్లపాడు మండలం అమ్మాపురానికి చెందిన మానికొండ గంగాధర్ కొద్ది కాలంగా యనమలకుదురులో ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. అయితే అతను యనమలకుదురు డొంకరోడ్డులో మద్యం అక్రమంగా అమ్ముతున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అతని వద్ద ఉన్న 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

కౌలు డబ్బులకు మరో అవకాశం

గన్నవరం: విమానాశ్రయ విస్తరణ కోసం లాండ్ పూలింగ్ పద్ధతిలో భూములు ఇచ్చిన యజమానులకు సంవత్సరం వారీగా కౌలు డబ్బులు జమ చేయడం జరుగుతుందని గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా మొదటి ఏడాది నుంచి 6వ సంవత్సరంతో పాటు ప్రస్తుత ఏడాదిలో కౌలు డబ్బులు పొందని యజమానులు 1సీ, సీసీ ఫారములు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను గన్నవరం తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శేరినరసన్నపాలెంలో చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తల్లిదండ్రులకు చెందిన నివాసంలో చోరీ జరిగింది. 15 రోజుల క్రితం బాపులపాడు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కై లే జ్ఞానమణి, సంజీవరావు దంపతులు పామర్రులోని కుమారుడు అనిల్‌కుమార్ ఇంటికి వెళ్లారు. కొద్దిరోజులుగా ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గుర్తించిన దొంగలు గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఇంటిని శుభ్రపర్చేందుకు వచ్చిన పని మనిషి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించింది. ఇంట్లోని సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండటంతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తల్లిదండ్రులకు సమాచారం అందించింది. హుటాహుటిన వచ్చిన కై లే జ్ఞానమణి, సంజీవరావు ఇంటిని పరిశీలించారు. నాలుగు బంగారు ఉంగరాలు, రెండు చెవిపోగులతో పాటుగా రూ.10 వేల నగదు అపహరణకు గురైనట్లుగా గుర్తించారు. ఎమ్మెల్యే సోదరుడు కైలే జగదీష్ ఈ ఘటనపై వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గన్నవరం డీఎస్పీ విజయ్‌పాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నాదసంగమం మహోత్సవాలు ప్రారంభం



వాగ్గేయకార కీర్తనలను గానం చేస్తున్న విజయలక్ష్మి బృందం

విజయవాడ కల్చరల్: త్రిపుర కల్చరల్ ఆర్ట్స్, తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా వారం రోజులపాటు నిర్వహించే నాద సంగమం సాంస్కృతిక మహోత్సవాలు సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా నెమ్మలూరి చంద్రశేఖర్ భక్తి రంజని, విజయనగరానికి చెందిన జీ రామలక్ష్మి బృందం వాగ్గేయకార సంకీర్తనం భక్తి రసప్రదానంగా సాగాయి. చివరిగా జ్యోస్యుల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో చిన్నారులు పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. వయోలిన్‌పై పాణ్యం దక్షిణామూర్తి, మృదంగంపై అమ్ముల ప్రసాద్ సహకరించారు. నాదసంగమం కార్యక్రమాలను బాలాత్రిపురసుందరి, బుర్రా పద్మనాభశాస్త్రి పర్యవేక్షించారు.

అవార్డు గ్రహీతలకు అభినందనల వెల్లువ



అవార్డు అందుకుంటున్న ఏఓ ఉదయ్‌భాస్కర్



అవార్డు స్వీకరిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ సురేష్



అవార్డు తీసుకుంటున్న వీపీఏ కె.పావని



పురస్కారం అందుకుంటున్న వీఆర్వో అన్నపూర్ణ



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



ప్రశంసాపత్రం అందుకుంటున్న సునితాశర్మ

కంకిపాడు: వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉద్యోగులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ అవార్డులను అందుకున్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతులమీదుగా పురస్కారాలను పొందారు. వీరిలో మండల పరిషత్ ఏఓ ఉదయ్‌భాస్కర్, వేల్పూరు ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్, పునాదిపాడు రైతుభరోసా కేంద్రం వీపీఏ కె.పావని ఉన్నారు. అవార్డులు అందుకున్న ఉద్యోగులకు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, మండల స్థాయి అధికారులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ వీఆర్వోగా అన్నపూర్ణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు వీఆర్వో ఎం. అన్నపూర్ణ, రామవరప్పాడులో ఉత్తమ అంగన్‌వాడీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. నాగలక్ష్మి కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, అవార్డులు అందుకున్నారు. నగరంలో గురువారం జరిగిన గణతంత్ర వేడుకల్లో భాగంగా ఈ ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. సర్పంచ్ శీలం రంగారావుతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు వీరికి అభినందనలు తెలిపారు.

ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంపీడీవో

పెనమలూరు: మండల ఎంపీడీఓ సునితాశర్మ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం మచిలీపట్నంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఎంపీడీవో సునీతాశర్మకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండల పరిషత్ సిబ్బంది ఎంపీడీఓకు శుక్రవారం అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు సత్కారం

కంకిపాడు: పాఠశాల అభివృద్ధికి విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుడు మండవ శ్రీనివాస్‌ను సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. నెప్పల్లి జెడ్పీ పాఠశాలలో శుక్రవారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఎంపీయూపీ పాఠశాల, జెడ్పీ పాఠశాలల్లో విద్యావిషయక అంశాల్లో శ్రీనివాస్ విశిష్ట సేవలు అందించారని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, తల్లమ్మతల్లి, మురళి పాల్గొన్నారు.

బాలల హక్కులపై మహిళలకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న హెచ్‌ఎం తేజోమయి

గన్నవరం రూరల్: మండలంలోని గోపవరపుగూడెం, కొండపావులూరు గ్రామాల్లో శుక్రవారం క్రాప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులపై మహిళలకు శిక్షణ నిర్వహించారు. ముస్తాబాద ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ నాగపద్మావతి, హెచ్‌ఎం మల్లెల తేజోమయి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. బాలబాలికలకు సమాన హక్కులు ఉండాలన్నారు. లింగ సమానత్వం ఉండాలని, బాల్య వివాహాలు నిర్మూలించాలని, బాలలకు ఇబ్బందులు ఎదురైతే 1098కి ఫోన్ చేయాలని, మహిళా హెల్ప్‌లైన్ కోసం 181 సమాచారం అందించాలని సూచించారు. వివక్షత లేని సమాజం రావాలన్నారు. కొండపావులూరు సచివాలయం కార్యదర్శి జోసఫ్ తంబి, మహిళా పోలీస్ తాజ్‌బున్నిసా, క్రాప్ జిల్లా సమన్వయకర్త సీహెచ్ ప్రభాకర్, అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రహదారి భద్రత పాటిస్తే మేలు



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం ప్రసాద్, ఎస్ఐ వీరప్రసాద్

ఉయ్యూరు: రహదారి భద్రత పాటిస్తే ప్రమాదాలు దరిచేరవని ఉయ్యూరు ఆర్‌టీసీ డిపో మేనేజర్ కెఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. స్థానిక బస్టాండులో రోడ్డు భద్రతావారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. డీఎం ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతతో నడుచుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రత ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. పట్టణ ఎస్ఐ ఎస్.వీరప్రసాద్ మాట్లాడుతూ వాహనం నడిపేసమయంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోవటం అంటే కుటుంబం రోడ్డున పడటమేనని అన్నారు. రహదారి భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు బద్రీనాథ్‌బాబు, ఇతర అర్చకులు కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈఓ భ్రమరాంబ, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణంలో పాల్గొన్న, వీక్షించిన భక్తుల ఇంట సకల శుభాలు కలుగుతాయని, సంతాన యోగం, వివాహాలు కాని వారికి వివాహాలు జరుగుతాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

అలరించిన భక్త రంజని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పలువురు ఆలపించిన భక్తిగీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన వరవీణ మ్యూజిక్ అకాడమీకి చెందిన శాంతిచంద్రిక, దుర్గ ఐశ్వర్య, శ్రియ, రాధశ్రీ పలు అమ్మవారి కీర్తనలను ఆలపించారు. భక్తులు ఆసక్తిగా వీక్షించారు.

పోయినవి

బండి నాగరాజు S/o. రాంబాబు, ప్రసాదంపాడు, విజయవాడ రూరల్ మండలం వారికి సంబంధించిన డాక్యుమెంట్ నెంబరు 183/1990 పోయినది. దొరికిన వారు క్రింది నెంబరును సంప్రదించి తెలియజేయగలరు. ✆ 99665 80677